క్లుప్తంగా

రైతులు ధైర్యంగా ఉండండి



మాలోత్ రాందాస్ నాయక్

వైరా: నియోజకవర్గంలో రైతులంతా ధైర్యంగా ఉండాలని ఎవరూ అధైర్య పడొద్దని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. మిచాంగ్ తుపాన్ వల్ల ఐదు మండలాల్లో వరి, పత్తి, మిర్చి మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిన విషయాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నానని, రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దని, ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం అనంతరం అన్ని మండలాల్లో పర్యటించి నష్టపరిహారం వివరాలను సేకరించి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం అందేలా చూస్తానన్నారు. ప్రతి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయిస్తానని.. పత్తి, మిర్చి వంటి పంటలకు ప్రభుత్వం నుంచి అందించే బీమా సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

సత్తుపల్లిటౌన్:గంగారం పీహెచ్‌సీ పరిధిలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు సత్తుపల్లి సీహెచ్‌సీలలో బుధవారం చిన్నారులకు జాతీయ వ్యాధి నిరోధర టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్.అవినాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు పునరావాసం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో పూరిళ్లు, రేకుల శిథిలావస్థకు చేరి తుఫాన్‌కారణంగా ఇంట్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్న పది కుటుంబాలకు బుధవారం స్థానిక ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాసం కల్పించారు. గ్రామ కార్యదర్శి పార్లవేణు అన్నారుగూడెంలోని ఎస్సీ కాలనీని సందర్శించగా తమ ఇళ్లు కురుస్తున్నందున ఉండలేక పోతున్నామని తెలపడంతో వారికి వెంటనే హైస్కూల్లో ఒక గదిని కేటాయించారు. వారికి అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని చెప్పారు.

మైకుసెట్ వితరణ

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (సంతగుడి)కి ఎన్ఆర్ఐ దిరిశాల నీరజ్‌కుమార్ రూ.15వేలు విలువ చేసే మైకుసెట్‌ను బుధవారం వితరణగా అందించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, ఆలయ పూజారి శ్రీనివాసులుకు మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ సోమందుల రాములు, దేవస్థానం సిబ్బంది గణితి నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ముత్యాలమ్మకు జలబిందెలతో ఊరేగింపు

ముదిగొండ: మండలంలోని పమ్మిలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, కోటమైసమ్మ, గోవిందమాంబ, బంగారు మైసమ్మ ప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా బుధవారం మహిళలు ఊరేగింపుగా జలబిందెలతో ఆలయానికి చేరుకున్నారు. గురువారం నూతన ఆలయం, విగ్రహప్రతిష్ఠల కార్యక్రమానికి ఉదయం 8:41 నిమిషాలకు ప్రతిష్ఠాపనాచార్య బొర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు ప్రతిష్ఠమహోత్సవం నిర్వహించనున్నారు. గ్రామంలో భక్తులు, మహిళలు, మేళ తాళ్లాలతో భారీగా ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అయ్యప్పస్వామి మాలాధారులు అయ్యప్పస్వామికి అభిషేక కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు సాగసాయిశర్మ ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమం అయ్యప్పస్వామి శరణుఘోషతో మార్మోగిపోయింది. కార్యక్రమంలో గురుస్వాములు సారయ్య, రాందాస్, శంకర్, శ్రీను, సాయి, అయ్యప్పమాలాధారులు రంగనాథ్, శ్రీనివాస్, వెంకటేష్, నాగరాజు, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలిపోయిన డ్రెయినేజీ



ఎన్టీఆర్ నగర్‌లో కూలిపోయిన డ్రెయినేజీ

సత్తుపల్లిటౌన్: వరదకు ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ కూలిపోయిన సంఘటన పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కాలనీ శివారులో మురుగునీటి ప్రవాహం కోసం ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ కొద్దిపాటి వరద తాకిడికే కుప్పకూలిపోయింది. బేస్‌మెంట్‌తో సహా పడిపోవడంతో దీని నాణ్యతపై స్థానికులు నివ్వెరపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ వీ.సురేష్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్ సేవా దృక్పథంతో ఆ డ్రెయినేజీ నిర్మించారని, దీనికి ఎటువంటి బిల్లులు చెల్లించలేదని తెలిపారు.

తుపాన్ బీభత్సం..



వైరా: గండగలపాడులో నీటిలో మునిగిన వరి పంటను చూపుతున్న రైతులు

- భారీ వర్షానికి దెబ్బతిన్న వరి, పత్తి, మిరప పైర్లు
- గాలులకు నేలకొరిగిన పైనం
- ఆవేదనలో అన్నదాతలు

మిచాంగ్ తుపాన్ రైతు కంట కన్నీరు మిగిల్చింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, ఈదురుగాలులకు మండలంలోని పలు గ్రామాలలో వరి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. గంపెడాశలతో సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షం.. అపార నష్టాన్ని మిగిల్చింది. వేలాది రూపాయల పెట్టుబడులు, ఆరుగాలం శ్రమపడి పండించిన పంటలు ఒక్క రోజులోనే దెబ్బతిన్నాయి. పలు చోట్ల వాగులు.. వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంటలకు నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్




మధిర: ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా నది



చింతకాని: మత్కేపల్లిలో నేలకొరిగిన మిర్చి పంట



వైరారూరల్: సిరిపురంలో నేలకొరిగిన పత్తిచేను



వేంసూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు వాగు



కారేపల్లి: భల్లునగరతండాలో..



కొణిజర్ల: పెద్దమునగాలలో వరిపంట



ఎర్రుపాలెం: తక్కెళ్లపాడులో..



వైరారూరల్: విప్పలమడకలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు



ముదిగొండ: అమ్మపేటలో..



చింతకాని: మత్కేపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న



తల్లాడలో..

నియోజకవర్గంలో పంటలకు తీరని నష్టం

- వరి 18,330 ఎకరాల్లో నష్టం
- మొక్కజొన్న 2,014 ఎకరాలు
- 7,194 ఎకరాల్లో దెబ్బతిన్న మిర్చి



వైరా: గండగలపాడులో నేలకొరిగిన వరిపంట

వైరా: తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో ఈ ఏడాది 35,197 ఎకరాలలో వరి సాగు చేయగా.. 18,330 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అదే విధంగా మొక్కజొన్న 3,512 సాగు చేయగా.. 2,014 ఎకరాల్లో పంట నేల కూలింది. మిర్చి 21,409 ఎకరాలలో సాగు చేయగా.. 7,194 ఎకరాలలో నష్టం వాటిల్లింది. అత్యధికంగా వరి వైరా మండలంలో 19 వేల ఎకరాలలో సాగవ్వగా 9,530 ఎకరాల్లో నష్టం జరిగిందని, కొణిజర్ల మండలంలో వరిసాగు 6 వేలకు గానూ.. 3,760 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మొక్కజొన్న 2,827 వేలకు గానూ 1,530 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మిర్చి అత్యధికంగా ఏన్కూరు 9,142 ఎకరాలకు 1,644 ఎకరాలు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ సందర్భంగా వైరా ఏడీఏ బాబూరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నష్టపోయిన పంటల అంచనాలు తయారు చేశామని, ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కొణిజర్ల: చిన్నగోపతిలో మిర్చితోటను పరిశీలిస్తున్న తెలంగాణ రైతుసంఘం నాయకులు

వైరా/కొణిజర్ల/తల్లాడ: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు నూతన ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, సీపీఐ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ తెలిపారు. బుధవారం వైరా, తల్లాడ, కొణిజర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్కో ఎకరానికి మిర్చికి రూ.2 లక్షలు, పత్తికి రూ.50 వేలు, వరికి రూ.40 వేలు వరకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులచే సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం బీజేపీ నాయకులు తల్లాడలో తహసీల్దార్ రవికుమార్‌కు, వైరాలో సీపీఎం నాయకులు ఏడీఏ బాబూరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామారావు, చలపతిరావు, చిన సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, రవి, సత్యనారాయణ, భాస్కర్, వీరభద్రం, బీజేపీ నాయకులు కృష్ణారావు, రమేష్, సుధాకర్, నాగేశ్వరరావు, రామారావు, నరసింహారావు, సత్యనారాయణ, చలపతిరావు, నరసింహారావు, సీపీఐ తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పలు ప్రాంతాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని.. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



సత్తుపల్లిటౌన్: మున్సిపల్ ఆఫీస్‌లో నివాళులర్పిస్తున్న చైర్మన్, అధికారులు



వైరా: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

సత్తుపల్లిటౌన్: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో అంటువ్యాధులు ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలని కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టీ.సీతారాం అన్నారు. బుధవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో డివిజన్‌లోని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. అంటువ్యాధులను నిర్మూలించేందుకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా వైద్యశిబిరాలు నిర్వహించాలని, ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తూ మందుల కిట్లను అందించాలని సూచించారు. పంచాయతీలు, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిండు గర్భిణులను ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం 102వాహనంలో సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు ఆర్.అవినాష్, చింతా కిరణ్‌కుమార్, రాములు, రత్నమనోహర్, నవ్యకాంత్, తబస్సుమ్, ఇందుప్రియతో పాటు పల్లె దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కారేపల్లి: కుటుంబంలో స్వల్ప వివాదం చోటు చేసుకోవడంతో క్షణికావేశంలో కలుపుమందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని గోవిందుతండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందుతండా గ్రామానికి చెందిన బర్మావత్ మీన(30) ఈ నెల 2వ తేదీన భర్త హరితో స్వల్ప వివాదం చోటుచేసుకోవడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మీన పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి సోదరుడు కేలోత్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైరాలో నేత్రదానం

వైరా: వైరాలో మృతి చెందిన కేసా నరసన్‌బాబు కళ్లను ఖమ్మం నేత్రనిధి వారికి బుధవారం దానం చేశారు. లయన్స్‌క్లబ్ వీడీజీ–2 నంబూరి మధు సహకారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్ మాట్లాడుతూ.. నేత్ర నిధి ద్వారా సేకరించిన కళ్లను హైదరాబాద్ పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాళ్ల నాగేశ్వరరావు, నంబూరి రామారావు, కాటేపల్లి రామకృష్ణ, తెల్లాకుల సందీప్, మల్లిఖార్జున రావు, కనకదుర్గ సాయినిఖిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

వేంసూరు: మండలంలోని పల్లెవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వరరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా బుధవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, ఎర్ర రమేష్, రావూరి నాయుడు, సాంబారు సత్యం, గాయం రాంబాబు, రామదాసు, రామారావు పాల్గొన్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పంటలను పరిశీలించిన అధికారులు

తుపాన్ కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచిన, నేలకొరిగిన పంటలను కాపాడుకోవడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలు మండలాల్లోని పంటలను పరిశీలించి రైతులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. పంట నష్ట నివారణకు సంబంధించి రైతులకు ఇంకా ఏమైనా సందేహాలుంటే స్థానిక ఏఈఓలను సంప్రదించాలన్నారు.



కల్లూరురూరల్: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి



మధిర: వరి పంటను పరిశీలిస్తున్న మల్లారం క్లస్టర్ ఏఈఓ వంశీకృష్ణ



వైరారూరల్: దాచాపురంలో..

మధిర: మండలంలోని మల్లారం, జాలిముడి, రొంపిమల్ల, రామచంద్రపురం గ్రామాల్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, మిర్చి పంటలను బుధవారం మల్లారం క్లస్టర్ ఏఈఓ వంశీకృష్ణ పరిశీలించారు. స్థానిక రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో తిరిగి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. పంట నష్ట శాతాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

ముదిగొండ: మండలంలోని ముదిగొండ, రాఘవాపురంలలో బుధవారం మండల వ్యవసాయాధికారిణి మందుల రాధ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని క్లస్టర్ల వైజ్‌గా ఏఈఓలు పరిశీలించినట్లు ఆమె తెలిపారు. మండలంలోని 13వందల ఎకరాల్లో వరి, 900 ఎకరాల్లో మిరప, మొక్కజొన్న 10ఎకరాల్లో, పత్తి 200 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనా వేశారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక పాల్గొన్నారు.

చింతకాని: మిచాంగ్ తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య రైతులకు సూచించారు. వర్షాలకు తడిసిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలని తెలిపారు.

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, రావినూతల, కలకోట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను బుధవారం మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి సరిత పరిశీలించారు. నష్ట నివారణకు సంబంధించిన తగు సూచనలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నాగినేని నాగసాయి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు, రాజులదేవరపాడు, భీమవరం, బనిగండ్లపాడు తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం మధిర ఏడీఏ కె.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కరరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సుష్మ, ప్రసన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి ఉన్నారు.

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి, కొండవనమాల, కాచారం, పెద్దమునగాల, చిన్నమునగాల గ్రామాల్లో ఏఓ డి. బాలాజీ ఏఈఓలతో కలిసి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న 50 రోజుల దశలోనే ఉండటం వల్ల రైతులు దున్ని మరో పంట వేసుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సరిత, రైతులు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని దాచాపురం, విప్పలమడక, గన్నవరంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను బుధవారం ఏడీఏ బాబురావు, ఏఓ పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం, రంగాపురం, మూలపోచారం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి నర్సింహారావు పరిశీలించారు. పత్తి, వరి, మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలోని పెనుబల్లి, గౌరారం, లింగగూడెం, రామచంద్రరావు బంజర్ గ్రామాల్లో టీఎఫ్ఎంఐటీ పీడీ రమణ, సత్తుపల్లి వ్యవసాయ శాఖ ఏడీ నరసింహారావు, మండల వ్యవసాయాధికారి ఏపీఎస్ రాజు, ఏఈఓ దీపక్ రెడ్డిలు నీట మునిగిన వరి పంటలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని, కింద పడిన మిర్చి చేలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 7 వేల ఎకరాల్లో వరి పంట నష్ట పోయిందన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, స్వామి, కృష్ణ, రాజా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: పుల్లయ్య బంజరుతోపాటు వాచానాయక్‌తండా, లింగాల, చెన్నూరు, పెద్దకోరుకొంది, నారాయణపురం, ముచ్చవరం గ్రామాల్లో రాశులను, దెబ్బతిన్న పంటలను ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, తహసీల్దార్ సాంబశివుడు పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రూప, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఏఈఓ దీపిక, ఆర్ఐలు స్టాలిన్, అన్వర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కొణిజర్ల: చిన్నమునగాలలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ, రైతులు



వేంసూరులో..



ముదిగొండ: రాఘవాపురంలో..

అధికారుల సలహాలు, సూచనలు

- వర్షాలు పూర్తిగా తగ్గేవరకు వరి కోతలు చేపట్టొద్దు..
- నీట మునిగిన వరి చేలల్లోని నీటిని బయటకు పంపి దుబ్బులను నిలబెట్టి కట్టలు కట్టాలి.
- కొత కోస్తే.. పనలు మొలకెత్తకుండా ఉండడానికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి.
- వర్షాలు తగ్గే వరకు పత్తి చేలల్లో నీటిని తొలగించి అంతర కృషి చేసి నేల ఆరే విధంగా చూసుకోవాలి.
- అధిక తేమ కారణంగా మొక్కలు ఎర్రబడటం, ఎండిపోవడం జరిగితే.. నివారణకు 2శాతం యూరియా ద్రావణాన్ని (లేదా) 2శాతం పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటికి కలిపి ఎండగా ఉన్న సమయంలో పిచికారీ చేయాలి.
- గాలిలో తేమశాతం ఉండటం వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందడానికి అవకాశం ఉన్నందున లీటర్ నీటికి 3 గ్రాముల మాంకోజెల్ (లేక) కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.